**Know the Truth**
**(Telugu)**

# సత్యాన్ని తెలుసుకో

మూలం

జీలాని ఖాన్
సయ్యద్ కాజిమ్
అబ్దుల్ హమీద్ హర్సోయ్

అనువాదం

అబ్దుల్ వాహెద్

# సత్యాన్ని తెలుసుకో

ఒక సన్నివేశాన్ని ఊహించండి. ఒక మనిషి బస్సులో ప్రయాణం చేస్తున్నాడు. బస్సు కండక్టరు అతని వద్దకు వచ్చాడు.

కండక్టరు : టిక్కట్

ప్రయాణీకుడు : నా దగ్గర లేదు

కండక్టరు : ఎక్కడికి వెళ్ళాలి

ప్రయాణీకుడు : నాకు తెలియదు

కండక్టరు : ఏంటీ? ఎక్కడికి వెళ్ళాలో తెలియదా?

ప్రయాణీకుడు : ఎక్కడికి వెళ్ళాలో తెలుసుకోవాలా? అసలెక్కడికి వెళ్ళడం అవసరమో నాకు తెలియదు.

కండక్టరు : ఎక్కడికెళ్ళాలో తెలియకపోతే బస్సెందుకెక్కావు?

ప్రయాణీకుడు : నాకు తెలియదు

కండక్టరు : ??? (అయోమయం)

ఆ బస్సులో మీరు కూడా ఉన్నారనుకోండి. ఆ ప్రయాణీకుడి గురించి మీరేమనుకుంటారు? ఈ సంభాషణను మానవజీవితానికి అన్వయించి చూడండి. ఇలాంటి ప్రశ్నలే అడిగి చూడండి. ఎవరు మనల్ని సృష్టించారు? మనం ఎందుకు పుట్టాము? మరణించిన తర్వాత ఏమవుతుంది? మనం ఎలాంటి లక్ష్యం లేకుండా యాధృచ్ఛికంగా పుట్టి మరణిస్తున్నామా? లేక మన పుట్టుక వెనుక ఏదన్నా లక్ష్యం ఉందా? మనలో ఎంతమందికి ఈ ప్రశ్నల జవాబులు తెలుసు? ముఖ్యమైన విషయమేమంటే, ఈ రోజు మనం బతికున్నాం. ఒక రోజు మనం కూడా మరణించక తప్పదు. దానికి మించి మనకేమి తెలుసు?

ప్రియ పాఠకులారా! ఈ చిరుపుస్తకం మీలో ఆలోచనలకు ప్రేరణనిస్తుందని

ఆశిస్తున్నాము. జీవితం గురించి, మనిషి పుట్టుకలోని పరమార్థం గురించి ఆలోచిం చేలా చేస్తుందని భావిస్తున్నాము.

## మనిషి పుట్టుకలో పరమార్థం ఏమిటి?

ఒకసారి మన చుట్టూ చూద్దాం. మనం కొండగుహలో బతకడం లేదు. మనం సమాజంలో బతుకుతున్నాం. మన చుట్టూ మనం తయారు చేసుకున్న వస్తువులున్నాయి. ఈ వస్తువులను సాధనాలను మనం ఎందుకు తయారు చేసు కున్నాం. ఈ వస్తువులను తయారు చేయడం వెనుక ఏదన్నా లక్ష్యం ఉందా అంటే ఖచ్చితంగా ఏదో ఒక లక్ష్యంతోనే మనం ఈ వస్తువులను తయారు చేసుకున్నాం. అలాగే మన శరీర అవయవాలను చూద్దాం. శరీరంలో ఏదన్నా అవయవం ఎలాంటి లక్ష్యం లేకుండా ఊరికే పడి ఉందా? అలాగే మన చుట్టు ఉన్న ప్రకృతి సహజమైన వాటిని చూద్దాం, చెట్లు కొండలు వగైరా అన్నీ ఎలాంటి ఉపయోగం లేకుండా ఊరికే ఉన్నాయా?

మనం తయారు చేసుకున్న ప్రతి వస్తువుకు ఏదో ఒక ఉపయోగం ఉంది. అలాగే మన శరీరంలోని ప్రతి అవయవానికి స్పష్టమైన ఉపయోగం ఉంది. చెట్లు, కొండలు వగైరా ప్రకృతి సహజమైన వాటికి కూడా వాటి ఉపయోగాలు ఉన్నాయి. కాబట్టి మానవాళి యావత్తు ఎలాంటి లక్ష్యం లేకుండా యాధృచ్ఛికంగా ఉనికిలో ఉందని భావించలేం. మానవాళి ఎందుకు జీవిస్తోంది? కేవలం సంపదను, పేరు ప్రతిష్ఠలను సంపాదించడానికి ఉనికిలోకి వచ్చిందా? కేవలం వినోదాల్లో విలాసాల్లో జీవితం గడపడానికి లేదా ప్రపంచంలో అత్యంత సంపన్నుడిగా మారడానికి ఇలాంటి లక్ష్యాలతో ఉనికిలో ఉన్నామా? కాదు, ఇంతకన్నా ఉన్నతమైన, ఉత్తమమైన లక్ష్యం మానవ జీవితానికి ఉంది. కాబట్టి నిజమైన లక్ష్యమేమిటో ఆలోచిద్దాం.

## మన ఉనికి లక్ష్యం ఎవరికి బాగా తెలుసు

మన జీవితలక్ష్యాన్ని ఎవరు నిర్ణయిస్తారు? "నా జీవితలక్ష్యాన్ని నేనే నిర్ణయించు కుంటాను" అని మీరు చెప్పవచ్చు. ఒక ఉదాహరణ చూద్దాం. ఒక పెన్ను ఉంది. దాని ఉపయోగం, లక్ష్యం ఏమిటి? పెన్ను ఉపయోగం, దాని లక్ష్యం రాయడం. దాన్ని ఎవరు నిర్ణయించారు? ఉపయోగించేవాళ్ళా? లేక తయారు చేసినవాళ్ళా?

మొదట దాన్ని తయారు చేసినవాడే ఈ లక్ష్యాన్ని నిర్ణయించాడు. ఉపయోగించేవాడు ఆ పెన్నును రాయడానికి వాడతాడో లేకపోతే వీపు గోక్కోవడానికి వాడతాడన్నది అతని ఇష్టం. కాని పెన్ను తయారు చేసింది వీపు గోక్కోడానికి అని మాత్రం చెప్పలేదు. దాన్ని తయారు చేసిన వాడే దాని ఉపయోగాన్ని నిర్ణయిస్తాడు.

అదేవిధంగా, మనం కూడా ఈ ప్రపంచంలో మన ఉనికి లక్ష్యం ఏమిటన్నది మన ఇష్టం వచ్చినట్లు ఊహించవచ్చు, కాని అవేవీ మన ఉనికికి అసలు లక్ష్యాలు కావు, కేవలం మన సృష్టికర్త ద్వారా మాత్రమే మన ఉనికి అసలు లక్ష్యం ఏమిటన్నది మనకు తెలుస్తుంది.

## ఒక సృష్టికర్త ఉన్నాడా? లేక మనం యాధృచ్ఛికంగా ఉనికిలోకి వచ్చామా?

చాలా మంది సైన్సును నమ్ముతారు. మతాన్ని పెద్దగా పట్టించుకోరు. కాబట్టి పరిణామక్రమాన్ని నమ్ముతారే కాని సృష్టిని నమ్మరు. ఈ విషయాన్ని కూడా కాస్త విశ్లేషించి చూద్దాం. మనం ఒక వంతెన చూశామనుకోండి. లేదా ఒక పెద్ద భవనాన్ని, లేదా ఒక పెద్ద కారును చూశాం. దాన్ని తయారు చేసినవాడు లేడని చెప్పగలమా? ఒక మనిషి లేదా ఒక కంపెనీ దాన్ని తయారు చేసింది.

మనిషి శరీరం విషయమేమిటి? మానవశరీరం అత్యంత సంక్లిష్టమైన నిర్మాణం కలిగి ఉంది. ఒకసారి మన మెదడు గురించి ఆలోచించండి. మెదడు ఎలా పని చేస్తుంది? ఎలా ఆలోచిస్తుంది? ఎలా సమాచారాన్ని సేకరిస్తుంది? ఎలా విశ్లేషిస్తుంది? ఎలా సమాచారాన్ని జ్ఞాపకం ఉంచుకుంటుంది? కేవలం కొన్ని సెకన్లలోనే ఎలా కావలసిన సమాచారాన్ని గుర్తు చేసుకుంటుంది? (ఇది చదవడానికి కూడా మీరు మీ మెదడునే వాడుతున్నారని మరిచిపోకండి). అలాగే మీ గుండె గురించి ఆలోచించండి. మనిషి జీవిత కాలమంతా, క్రమం తప్పకుండా ఎలా రక్తాన్ని సరఫరా చేస్తుంది? కిడ్నీల గురించి, కాలేయం గురించి అవి చేసే వివిధ పనుల గురించి ఆలోచించండి. శరీరంలోని ప్రక్షాళనా అవయవాలు ఒకేసమయంలో వందలాది రసాయనిక ప్రక్రియలను నిర్వహిస్తూ ఉంటాయి. శరీరంలోని కాలుష్యాల స్థాయి మించకుండా అదుపు చేస్తుంటాయి. మనిషి కళ్ల గురించి ఆలోచించండి. ఇవి

సాటిలేని కెమెరాలు. వాటికవే అడ్జస్టవుతాయి. ఫోకస్ చేస్తాయి. దృశ్యాన్ని సమీక్షిస్తాయి. రంగులను గుర్తిస్తాయి. కాంతి తీవ్రతకు అనుగుణంగా ప్రతిస్పందిస్తాయి.

ఏదో యాధృచ్ఛికంగా లేదా పరిణామక్రమంలో ఏర్పడినదైతే ఇంత ఖచ్చిత మైన, అందమైన, సమర్థవంతమైన, సంక్లిష్టమైన వ్యవస్థ రూపుదిద్దుకుంటుందా? మనిషి శరీర వ్యవస్థ యావత్తు కేవలం దానికదే రూపొందిందా? ఉదాహరణకు వివిధ రంగులను గోడపై విసిరేశామనుకోండి. అలా విసిరేస్తే ఏదో ఒక డిజైనులా కనబడవచ్చు కాని ఒక మోనాలిసా వంటి చిత్రపటం తయారు కాదు. మన శరీర నిర్మాణం మోనాలిసా చిత్రపటం కన్నా సంక్లిష్టమైనది. కాబట్టి ఒక సృష్టికర్త లేకుండా కేవలం యాధృచ్ఛికంగా ఇదంతా ఉనికిలోకి వచ్చిందని చెప్పడం హేతుబద్ధత అవుతుందా?

ఇప్పుడు మనం విశ్వం గురించి ఆలోచిద్దాం. మన సౌరవ్యవస్థలో భూమి కూడా ఒక గ్రహం. మన గ్యాలక్సీలోని అనేక నక్షత్ర వ్యవస్థల్లో మన సౌరవ్యవస్థ కూడా ఒకటి. మన గ్యాలక్సీ పేరు మిల్కివే లేదా పాలపుంత. విశ్వంలోని అనేక గ్యాలక్సీల్లో ఇది కూడా ఒకటి. విశ్వంలో ఒక అత్యున్నతమైన క్రమం మనకు కనబడుతుంది. ఉదాహరణకు, సూర్యగ్రహణం, చంద్రగ్రహణాలను ముందుగానే లెక్కించి చెప్పవచ్చు. సూర్యోదయం, సూర్యాస్తమయాలను ముందుగానే లెక్కించి చెప్పవచ్చు. ఒక్కరోజు గురించే కాదు రానున్న వందసంవత్సరాల కాలానికి సూర్యో దయ, సూర్యాస్తమయ సమయాలను ముందుగానే ఖచ్చితంగా లెక్కించవచ్చు. ఇంత ఖచ్చితంగా లెక్కించగలమంటే, విశ్వంలో ఖచ్చితమైన క్రమం, సమతుల్యం, పద్ధతి ఉన్నాయి. విశ్వంలోని నక్షత్రాలు, గ్రహాలన్నీ ఖచ్చితంగా వాటి లెక్క ప్రకారమే తిరుగుతున్నాయి. ఒక మహోన్నతస్థాయి ప్రణాళిక, క్రమం విశ్వంలో ఉన్నాయన డానికి ఇది తిరుగులేని ఉదాహరణ.

ఈ మహోన్నతమైన క్రమం, ఏర్పాటు దానికదే యాధృచ్ఛికంగా ఉనికిలోకి వచ్చిందా? కేవలం ఒక పేలుడు వల్ల ఇదంతా ఏర్పడిందా? యాధృచ్ఛికంగా ఏర్పడేది ఏదైనా ఎలా ఉంటుందో ఒకసారి చూద్దాం. ఒక సంచిలో వివిధ రంగుల్లో ఉన్న పది రాళ్ళను ఉంచి ఆ సంచిని అటూ యిటూ తీవ్రంగా కుదిపి, ఆ తర్వాత ఆ

పదిరాళ్ళను కళ్ళు మూసుకుని సంచిలోంచి ఒకదాని తర్వాత ఒకటి తీశామనుకోండి. మొదట మనం పదిరాళ్ళను ఒకదాని తర్వాత ఒకటి ఏ క్రమంలో సంచిలో వేశామో అదే క్రమంలో మళ్ళీ ఆ రంగురాళ్ళను బయటకు తీయగలమా? 2,60,00,000 సార్లు ప్రయత్నిస్తే ఒకసారి మనం మొదట సంచిలో వేసిన క్రమంలోనే మళ్ళీ యాధృచ్ఛికంగా తీయడం సాధ్యపడుతుందని లెక్కలు చెబుతున్నాయి. ఇది కేవలం పది రాళ్ళను యాధృచ్ఛికంగా తీయాలని ప్రయత్నిస్తే లభించే ఫలితం. కాని విశ్వంలో కోట్లాది నక్షత్రాలు, గ్రహాలు అన్నీ ఖచ్చితంగా ఒక డిజైను ప్రకారం ఉనికిలోకి రావడమన్నది కేవలం యాధృచ్ఛికంగా జరిగే అవకాశం లేనేలేదు. కాబట్టి ఒక సృష్టికర్త లేడని చెప్పడం సహేతుకం కాదు. ఈ మహా విశ్వాన్ని సృష్టించిన ఒక సృష్టికర్త ఉన్నాడు.

## సృష్టికర్త ఈ విశ్వాన్ని సృష్టిస్తే ... సృష్టికర్తను ఎవరు సృష్టించారు

కాస్మాలజీ ప్రకారం ఈ విశ్వం 14 బిలియన్ సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఒక బిలియన్ అంటే వంద కోట్లు. అంటే 14 వందల కోట్ల సంవత్సరాల క్రితం ఈ విశ్వం ప్రారంభమైంది. బిగ్ బ్యాంగ్ అనబడే మహా ప్రేలుడులో ఈ విశ్వం పుట్టింది. విశ్వంతో పాటే కాలం కూడా ఉనికిలోకి వచ్చింది. ఈ విశ్వంలో సృష్టించబడినవన్నీ కాలంపై ఆధారపడి ఉన్నాయి. అంటే ప్రతిదీ ఒక ప్రారంభాన్ని, ఒక ముగింపును కలిగి ఉంది. కాని విశ్వాన్ని, దానితో పాటు సృష్టించబడిన కాలాన్ని సృష్టించిన సృష్టికర్త కాలం పుట్టుకకు ముందు నుంచి ఉన్నాడు. కాలం అనేది ఆయనకు వర్తించదు. కాబట్టి సృష్టికర్తకు ఒక ప్రారంభం లేదు, ఒక ముగింపు లేదు. ఇప్పుడు మీరు చదువుతున్న ఈ చిరుపుస్తకం గురించి ఆలోచించండి. ఈ పుస్తకానికి ఒక ప్రారంభం, అంటే ఇది రూపొందిన సమయం అనేది లేనట్లయితే, ఇది అనాదిగా ఉనికిలో ఉన్నట్లే లెక్క అవుతుంది. అంటే దీన్ని తయారు చేసిన వారు ఎవరూ ఉండరు. అంటే దీనికి రచయిత ఎవరు ఉండే అవకాశం లేదు. కాని ఈ పుస్తకానికి ఒక ప్రారంభం ఉంది కాబట్టి దీన్ని రాసినవాడు కూడా ఉన్నాడు.

మరో పరిస్థితిని ఊహిద్దాం. యుద్ధంలో ఒక సైనికుడు శత్రువును గుర్తించాడు. కాని కాల్పులు జరపాలంటే పై అధికారి అనుమతి కావాలి. కాని ఆ అధికారి

తనపై ఉన్న మరో అధికారి అనుమతి అవసరం కాబట్టి తాను ఇవ్వలేనన్నాడు. అ పై అధికారి మరో పై అధికారి అనుమతి కావాలన్నాడు. ఇలా, ఒకరిపై ఒకరు ఆధారపడే ఈ పరంపర కొనసాగుతూ వెళితే ఆ సైనికుడు లక్ష్యంపై కాల్పులు జరపడం సాధ్యపడుతుందా? ఎన్నటికీ సాధ్యపడదు. కమాండ్ చైన్‌లో స్వేచ్ఛగా సైనికుడికి ఆదేశాలివ్వగలిగే అధికారి ఎవరైనా ఉన్నప్పుడే సైనికుడు లక్ష్యంపై కాల్పులు జరపగలడు.

ఈ సూత్రాన్నే మనం విశ్వానికి అన్వయిస్తే, విశ్వం ఉనికిలోకి రావడమన్నదే దీన్ని సృష్టించిన సృష్టికర్త ఒకడు ఉన్నాడనడానికి బలమైన ఉదాహరణ. ఆయన స్వేచ్ఛగా తాను చేయాలనుకున్న పని చేసే అధికారాలన్నీ ఉన్నవాడు. అతనే సృష్టికర్త లేదా దేవుడు.

## దేవుడంటే ఎవరు?

దేవుడన్న పదాన్ని వివిధ అర్థాలతో, వివిధ భాషల్లో, వివిధ మతాల్లో, వివిధ సంస్కృతులు, వివిధ తత్వాల్లో ఉపయోగించడం జరుగుతోంది. కొందరి దృష్టిలో తమకు అవసరంలో ఆదుకున్నవారు దేవుళ్ళు. కొందరికి కన్న తల్లిదండ్రులు దేవుళ ౢ. చాలామందికి చారిత్రక ప్రసిద్ధి పొందిన గొప్పవ్యక్తులు దేవుళ్ళు. దురాశపరులకు సంపదే దైవం. కొందరికి ప్రకృతే దైవం. ఇంకొందరికి సమస్తమూ దైవమే.

కాని దేవుడన్న పదానికి సరయిన అర్థం గ్రహించడం కష్టమేమీ కాదు. ఎవరన్నా వచ్చి మీ తల్లిగారి పేరేమిటి అనడిగితే వెంటనే మనకు జన్మనిచ్చిన తల్లి పేరు చెబుతాం. మనం మదర్ థెరిస్సాను మదర్ అని పిలవవచ్చు. మాతృమూర్తి అని గౌరవంగా సంబోధించవచ్చు., కాని మనకు జన్మనిచ్చిన అమ్మ వేరు, మదర్ థెరిస్సా వేరు. మనకు ఇష్టం వచ్చినవారిని మన తల్లిగా ఎన్నుకునే స్వేచ్ఛ మనకు లేదు. కేవలం మనకు జన్మనిచ్చిన స్త్రీ మాత్రమే మనకు అమ్మ అవుతుంది.

అదేవిధంగా దేవుడు ఒక్కడే. ఈ విశ్వాన్ని, మనందరినీ సృష్టించినవాడే దేవుడు. ప్రజలు ఎవరినైనా, దేన్నయినా దేవుడిగా పిలవవచ్చు, కాని నిజదైవం మాత్రం యావత్తు ప్రపంచాన్ని సృష్టించినవాడు మాత్రమే. మనకు మన ఇష్టం వచ్చిన వారిని దేవుడిగా ఎన్నుకునే స్వేచ్ఛ లేదు. మనందరినీ సృష్టించినవాడు మాత్రమే దేవుడు. సృష్టించబడినవేవీ, అవి ఎంత గొప్పవైనా సరే దైవం కాలేవు.

## జీవిత లక్ష్యం ఏమిటి?

మనందరినీ ఎందుకు సృష్టించడం జరిగిందంటే ఆరాధించడానికి, విధేయత చూపడానికి, మన సృష్టికర్త ఒక్కడినే సేవించడానికి. అంతేకాని సృష్టించబడిన వాటిలో ఎవరి సేవ కోసమూ కాదు. మన జీవితాన్ని దేవుడు చూపిన దారిలో గడపడమే మన జీవిత లక్ష్యం. దేవుని ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ, దేవుని ప్రసన్నత పొందడానికి ప్రయత్నిస్తూ, పరలోక సాఫల్యం పొందడమే జీవితలక్ష్యం.

## దేవుడు మన విధేయత ఎందుకు కోరుతున్నాడు?

తల్లిదండ్రులు పిల్లలు తమ పట్ల విధేయత చూపాలని కోరుతారు. ఎందుకంటే కన్నవారిగా వారికి పిల్లల విధేయత పొందే సహజమైన హక్కు ఉంది. అదేవిధంగా ఉపాధ్యాయుడు విద్యార్థులు తనకు విధేయత చూపాలని కోరుతాడు. ఎందుకంటే అలా కోరే హక్కు ఆయనకు ఉంది. అలాగే దేవుడు మనందరినీ సృష్టించినవాడు కాబట్టి మన విధేయత కోరే హక్కు ఆయనకు ఉంది.

మనం మోటారు వాహనాలు నడుపుతుంటాం. వాహనానికి నాణ్యమైన ఆయిల్ వేసినపుడు, సరయిన విడిభాగాలు సమకూర్చినప్పుడు, టైర్లలో ఒత్తిడి సరిగా ఉన్నప్పుడే, అంటే ఆ వాహన తయారీ సంస్థ సూచించిన విధంగా ఉన్నప్పుడే వాహనం చక్కగా పనిచేస్తుంది. మనం ఈ విషయంలో మన ఇష్టం వచ్చినట్లు ఏదో ఒక ఆయిల్ వేయడం, ఏదో ఒక విడిభాగాలతో వాహనాన్ని నడపాలని ప్రయత్నించడం చేయం. ఎందుకంటే, వాహనాన్ని తయారు చేసిన సంస్థ చెప్పిన మాటలు మనం నమ్ముతాం. తయారు చేసిన వారికే వాహనం గురించి బాగా తెలిసి ఉంటుందని భావిస్తాం. అదేవిధంగా, మనకు ఏది మంచిదో మన సృష్టికర్తకు మాత్రమే తెలుసు. ఆయన మనకు ఒక జీవితవిధానాన్ని సూచించాడు. దేవుని పట్ల విధేయత చూపడమే ఆ జీవనవిధానం.

## దేవుడు మానవాళికి తన మార్గదర్శనాన్ని పంపించాడా?

దేవుడు మనందరినీ మార్గదర్శనం లేకుండా వదిలేయలేదు. మనం మనిషిని ఒక యంత్రంతో పోల్చితే, మనిషి భూమిపై అత్యంత సంక్లిష్ట నిర్మాణం కలిగిన యంత్రం వంటి వాడు. మనిషికి భావావేశాలు, ఆలోచనలు ఉంటాయి. ఒక

యంత్రాన్ని సరిగా వాడుకోవాలంటే మనకు యూజర్ మాన్యుల్ అవసరం. అలాగే వివరించి చెప్పే వ్యక్తి కూడా అవసరం.

మనిషి మంచి జీవితం ఎలా గడపాలో తెలియజేయడానికి దేవుడు సన్మార్గులైన పుణ్యాత్ములను మనుష్యుల్లోనే ఎన్నుకున్నాడు. దేవుడు మానవాళి కోసం పంపించిన ప్రవక్తలు వీరే. అలాగే దేవుడు తన దైవగ్రంథాల ద్వారా మనిషి ఎలా నడుచుకోవాలో తెలియజేసే జీవనవిధానాన్ని, మనకు అవసరమైన మాన్యుల్‌ను కూడా పంపించాడు.

## ప్రవక్తలు ఎవరు?

మనలో ధర్మపరాయణులను, సన్మార్గంపై నడిచే పుణ్యాత్ములను దేవుడు ప్రవక్తలుగా ఎంచుకున్నాడు. ఈ ప్రవక్తలు మానవమాత్రులే. వారికి దైవిక లక్షణాలు ఏవీ లేవు. కాని వారు మానవాళికి ఆదర్శ ఉదాహరణలుగా, మానవాళికి నాయకులుగా సత్యమార్గాన నడిపించడానికి వచ్చారు.

ప్రపంచంలో ప్రతి జాతి వద్దకు దైవప్రవక్తలను దేవుడు పంపించాడు. వీరిలో కొందరి పేర్లు – నూహ్, ఇబ్రాహీం, దావూద్, సులైమాన్, మూసా, ఈసా (వారందరికీ శాంతి కలుగుగాక).

దేవుడు స్వయంగా భూమిపైకి ఎందుకు రాలేదు?

మనిషి వేరు, దేవుడు వేరు. మనిషికి దేవునికి మధ్య ఎలాంటి పోలికా లేదు. దేవుడు మనిషిగా మారితే ఇక దేవునిగా ఉండడు.

ఉదాహరణకు :

1. దేవుడికి మరణం లేదు. మనిషి మరణిస్తాడు.

2. దేవుడికి స్థలకాలాలు వర్తించవు. కాని మనిషికి స్థలకాలాలు వర్తిస్తాయి. కాబట్టి దేవుడు మనిషిగా మారాడని చెప్పడం ఒక పెద్ద వైరుధ్యం అవుతుంది.

3. మనిషికి చాలా పరిమితులున్నాయి. ఉదాహరణకు, కుక్కలు వినగలిగే శబ్దాలను మనిషి వినలేడు. గుడ్లగూబ చూడగలిగే దృశ్యాలు మనిషి చూడలేడు. దేవుడు మనిషిగా మారడమంటే, దేవుడు కూడా ఈ పరిమితులు పెట్టుకోవడమే అవుతుంది. కాని దేవుడి గుణగణాలు శక్తిసామర్థ్యాలకు ఇది విరుద్ధమైన విషయం.

కాబట్టి, దేవుడు దేవుడే, మనిషి మనిషే. మనిషి దేవునిగా మారడం అన్నది లేదు. మనిషి దేవుడు ఒక్కడే కావడం అన్నది లేదు.

దేవుడు ఏదైనా చేయగలడు కాబట్టి ఒకేసమయంలో మనిషిగాను, దేవునిగాను ఉండగలడని కొందరు వాదించవచ్చు.

దేవుడు ఏదైనా చేయగలడు అని చెప్పడంలో అర్థమేమిటో గమనించాలి. దేవుడు ఏదైనా చేయగలడంటే దేవుడు అన్యాయం చేయగలడా? దేవుడు అబద్ధం చెప్పగలడా? ముమ్మాటికి కాదు. ఎందుకంటే, అన్యాయం, అబద్ధాలు దేవుని గుణగణాలకు పూర్తి విరుద్ధమైనవి. కాబట్టి దేవుడు తనకు శోభనిచ్చే, తన గుణగణాలకు తగిన పనులే చేస్తాడు. కాబట్టి దేవుని దైవిక లక్షణాలకు మనిషిగా మారడమన్నది విరుద్ధమైన విషయం, ఎందుకంటే, అలా మారడం వల్ల మనిషికి ఉండే పరిమితులను విధించుకోవడం అవుతుంది కాబట్టి ఆ పని చేయడు.

దేవుడు భూమిపైకి వస్తాడని వాదనకు అనుకున్నా, ఆయన అలా రావడం వల్ల మనిషికి మార్గదర్శనం ఇవ్వాలన్న ఉద్దేశ్యం ఎలా నెరవేరుతుంది? ఆయన మనిషికి ఆదర్శ నమూనాగా ఎలా ఉండగలడు? ఆయన ఆదర్శ నమూనాగా జీవించినా, దేవుడు కాబట్టి అలా బతుకుతున్నాడు, సాధారణ మానవులం మనం బతగ్గలమా అని సగటు మనిషి భావించవచ్చు. కాబట్టి మనిషిగా అవతరించే దేవుడు మనిషికి ఆదర్శనమూనా కాలేడు. ఎందుకంటే మనిషికి ఉండే పరిమితులు, బలహీనతలేవీ దేవుడికి ఉండవు. దేవుడు తన దైవిక శక్తులతో ఎలాంటి సమస్యనైనా సునాయాసంగా అధిగమించగలడు. కాని మనిషికి సమస్యలతో సంఘర్షించక తప్పదు. కాబట్టి మానవాళికి ఉత్తమమైన, ఆదర్శవంతమైన నమూనాగా ఒక మనిషి మాత్రమే ఉపయోగపడగలడు. అలాంటి మనుష్యులే దైవప్రవక్తలు.

## ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) ఎవరు?

ప్రవక్తల పరంపరలో చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక). యావత్తు మానవాళి మార్గదర్శనానికి ఆయన్ను దేవుడు పంపించాడు. ప్రళయం వరకు మరో ప్రవక్త ఎవరూ రారు. ఆయనకు ముందు పంపబడిన ప్రవక్తలందరూ ఏదో ఒక కాలానికి, ఏదో ఒక ప్రాంతానికి, ఏదో ఒక జాతికి మాత్రమే పంపబడ్డారు.

## దైవప్రవక్తల బోధనలేమిటి?

దైవప్రవక్తలందరి బోధనల సారాంశం ఒక్కటే. అది :

1. దేవుడిని ఆరాధించండి. ఆయనకు విధేయత చూపండి. దేవుడొక్కడినే ఆరాధించండి. ఆయనే సృష్టికర్త. ఆయనే మనందరినీ సృష్టించాడు (సృష్టికర్తను ఆరాధించండి, సృష్టిని కాదు). ఇతరులెవరికీ, ఏ వస్తువుకూ దేవుడి స్థాయి కల్పించకండి. దేవుడి ఉనికిని తిరస్కరించకండి. దేవుడితో భాగస్వాములను చేర్చకండి.

2. మరణానంతరం మనందరం దేవునికి జవాబు చెప్పుకోవలసి ఉంది. ఈ ప్రపంచంలో మనం చేసిన ఆచరణలకు జవాబు చెప్పవలసి ఉంటుంది.

## దివ్యఖుర్ఆన్ అంటే ఏమిటి?

దివ్యఖుర్ఆన్ దేవుని తరఫున అవతరించిన చిట్టచివరి దైవగ్రంథం (మనిషికి మార్గదర్శక గ్రంథం). చిట్టచివరి దైవప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతికలుగుగాక)కు దేవుడు ప్రసాదించిన గ్రంథం. మొత్తం దివ్యఖుర్ఆన్ దేవుని వాక్కు. దివ్యఖుర్ఆన్ ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) రాసిన గ్రంథం కాదు. దివ్యఖుర్ఆన్ యావత్తు మానవాళికి మార్గదర్శక గ్రంథం.

## దేవుని లక్షణాలేమిటి?

దేవుని కొన్ని ముఖ్య లక్షణాలు:

1. దేవుడు ఒక్కడే.
2. దేవునికి ఏ అవసరమూ లేదు. ఆయనకు ఎలాంటి పరిమితులు, బలహీనతలు లేవు.
3. ఆయనకు తల్లిదండ్రులు లేరు. భార్యాపిల్లలు లేరు.
4. శక్తిసామర్థ్యాలు, జ్ఞానవిజ్ఞానాలు, వివేకం, దయాకారుణ్యాలు వగైరా గుణగణాల్లో ఆయనకు సాటి ఎవరూ లేరు.
5. దేవునికి అలసట రాదు.
6. దేవుడు ఏదీ మరిచిపోడు. పొరబాట్లు చేయడు.
7. దేవుడి వల్ల తప్పిదాలేవీ జరగవు.

8. మనుష్యులందరినీ దేవుడు కరుణిస్తాడు. రంగు, జాతి, వంశం రీత్యా ఎవరిపట్ల వివక్ష చూపడు.

## ఒకరి కన్నా ఎక్కువ దేవుళ్ళు ఉండొచ్చా?

ముగ్గురు వ్యక్తులు ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్ళారనుకుందాం. ఒకే ఒక్క ఖాళీ ఉంది. ఆ ముగ్గురు తమ తమ దేవుళ్ళకు ఆ ఉద్యోగం తమకే రావాలని మనస్ఫూర్తిగా వేడుకున్నారు. ఒకవేళ ఒకరికన్నా ఎక్కువ దేవుళ్ళు ఉన్నారనే మనం అనుకుంటే, ఆ ముగ్గురు ప్రార్థిస్తున్న ముగ్గురు దేవుళ్ళు తమ భక్తుడికే ఆ ఉద్యోగం వచ్చేలా చేయాలని భావిస్తారు. కాని ఖాళీ ఒక్కటే ఉంది. ముగ్గురు అభ్యర్థులు ఆ ఉద్యోగం తమకే రావాలని పోటీ పడుతున్నారు. ముగ్గురు దేవుళ్ళు తమ భక్తుడైన అభ్యర్థికే ఆ ఉద్యోగం వచ్చేలా చేయాలని భావిస్తున్నారు. ఇక ఆ ఉద్యోగం ఎవరికి దొరకాలి? ఇలాంటి చిన్న చితక వ్యవహారం కూడా దేవుళ్ళ మధ్య ఘర్షణకు దారితీసే అవకాశం లేదా? ప్రపంచంలో రోజూ వందల కోట్ల సంఘటనలు జరుగుతుంటాయి. ప్రతి సంఘటనకు దేవుని ఆమోదం అవసరమే. ఒకరి కన్నా ఎక్కువ దేవుళ్ళు ఉంటే యావత్తు విశ్వంలో ఎలాంటి గందరగోళం నెలకొంటుందో పై ఉదాహరణ నేపథ్యంలో అంచనా వేయండి.

## దేవుడికి అవసరాలు ఉన్నాయా? భార్యాపిల్లలు ఉన్నారా? తల్లిదండ్రులు ఉన్నారా?

దేవుడికి అవసరాలు ఉన్నాయని మనం అనుకుంటే, ఆ అవసరాలు తీర్చడానికి ఎవరో ఒకరు ఉండాలి. అంటే దేవుని అవసరాలు తీర్చేవ్యక్తికి దేవుడిలో లేని ప్రత్యేకతలేవో ఉన్నాయి. అంటే ఆ వ్యక్తి లేకుండా దేవుడు పరిపూర్ణుడు కాదు. ఉదాహరణకు, మనిషికి జీవితభాగస్వామి కావాలి. ఎందుకంటే మనకు జీవితం గడపడానికి ఒక తోడు అవసరం కాబట్టి. దేవుడికి ఒక భార్య అవసరం అనుకుంటే, ఆయన తన కోరికలు తీర్చుకోడానికి భార్యపై ఆధారపడినట్లే. అంటే ఆయన కూడా ఆధారపడుతున్నవాడే అవుతాడు. ఇది స్వభావరీత్యా దేవునికి విరుద్ధమైన విషయం. కాబట్టి దేవునికి ఒక భార్య ఉండడమన్నది అసంబద్ధమైన విషయం.

దేవునికి భార్య లేనప్పుడు పిల్లలు ఉండే అవకాశమే లేదు. దేవుడికి తల్లిదండ్రులు ఉన్నట్లయితే, ఆయన పుట్టకముందు ఉనికిలో లేనట్లే కదా. అంటే కాలంలో ఒకప్పుడు ఆయన ఉనికిలో లేడని భావించాలి. స్థలకాలాలేవీ దేవునికి వర్తించవు, దేవుని గుణగణాలకు ఇది పూర్తి విరుద్ధమైన విషయం. కాబట్టి దేవునికి తల్లిదండ్రులు లేరు.

## దేవుడికి అలసట వస్తుందా? ఆయన తప్పులు చేయొచ్చా? ఆయన మరిచి పోవడం జరుగుతుందా?

దేవుడు సర్వశక్తిసంపన్నుడు. కాబట్టి ఆయన అలసిపోవడం అన్నది జరగదు. ఆయన అన్నీ తెలిసినవాడు. కాబట్టి ఆయన తప్పిదాలు చేసే అవకాశమే లేదు. మరచిపోయే అవకాశం అంతకన్నా లేదు.

దేవునికి సమానులు ఎవరైనా ఉంటే, అతడు తాను కూడా దేవుడినేనని వాదిస్తాడు. అంటే ఒకరికన్నా ఎక్కువ మంది దేవుళ్ళు. ఇంతకు ముందు మనం చెప్పుకున్నట్లు ఒకరికన్నా ఎక్కువ మంది దేవుళ్ళు ఉండడం అసాధ్యం.

## మరణానంతరం జీవితం ఉందా?

హక్కులతో పాటు బాధ్యతలు ఉంటాయి. ఒక ఉద్యోగి తన పై అధికారికి జవాబు చెప్పుకోవాలి. తాను చేసిన పని గురించి లెక్క చెప్పాలి. ప్రపంచంలో ఎవరైనా, ఎంత పెద్ద హోదాలో ఉన్నవారైనా ఎవరో ఒకరికి జవాబు చెప్పుకోవాలి. ఇది జీవితంలో ఒక మౌలిక సత్యం. అదేవిధంగా, సృష్టికర్త విశ్వసామ్రాజ్యాధిపతి. మనం ఈ ప్రపంచంలో చేసిన పనులకు ఆయన వద్ద లెక్క చెప్పుకోవడం తప్పదు. ఈ విధంగా బాధ్యతవహించే పరిస్థితి లేనట్లయితే న్యాయం జరగదు.

ఒకరోజు ఈ యావత్తు ప్రపంచం అంతరించడం తప్పదు. ప్రపంచంలో పుట్టిన మానవులందరూ, మొట్టమొదటి మనిషి నుంచి చిట్టచివర పుట్టిన వ్యక్తి వరకు అందరూ తిరిగి లేపబడతారు (పునరుజ్జీవం). తీర్పుదినాన వారందరినీ వారి ఆచరణల గురించి ప్రశ్నించడం జరుగుతుంది. ఒకే ఒక్క నిజమైన దేవుడిని ఆరాధించినవారు, మంచి పనులు చేసినవారు, దేవుని ఆదేశాల ప్రకారం జీవితాన్ని గడిపినవారు తగిన కానుకలు పొందుతారు. దేవుణ్ణి తిరస్కరించినవారు శిక్షకు

గురవుతారు. మంచివారికి కానుకగా స్వర్గం లభిస్తుంది. శిక్షపొందిన వారు నరకానికి పోతారు. స్వర్గంలో కాని, నరకంలో కాని జీవితం శాశ్వతమైనది.

## పునరుజ్జీవం, తీర్పుదినం అవసరమేమిటి?

ప్రతి మనిషి న్యాయం జరగాలని కోరుకుంటాడు. ఇతరుల కోసం న్యాయం కోరుకోకపోయినా తనకోసం న్యాయమే కోరుకుంటాడు. అన్యాయానికి గురైన వ్యక్తి నేరస్తులకు కఠిన శిక్ష పడాలని భావిస్తాడు. దోపిడీ దొంగలు, అత్యాచారాలకు పాల్పడిన నేరస్తులకు కఠిన శిక్షలు పడాలని సాధారణంగా అందరూ భావిస్తారు. కాని ఈ ప్రపంచంలోని వ్యవస్థలో మనకు ఖచ్చితమైన న్యాయం లభిస్తుందా? హిట్లర్ తన పాలనా కాలంలో అనేకమందిని హతమార్చాడంటారు. ఒకవేళ చట్టప్రకారం అతడిని నిర్బంధించి శిక్షించాలనుకున్నా, ఇవ్వగలిగిన గరిష్ఠ శిక్ష ఏమిటి? మహా అయితే మరణశిక్ష. కాని ఒక మనిషిని చంపినందుకే ఆ శిక్ష సరిపోతుంది. అనేకమందిని చంపిన నేరానికి ఇంతకన్నా పెద్ద శిక్ష ఏమన్నా ఉందా?

న్యాయమూర్తులు కొన్ని కేసుల్లో అనేక యావజ్జీవ కారాగార శిక్షలు విధించారన్న వార్తలు అప్పుడప్పుడు మనం చదువుతాం. ఎన్ని సంవత్సరాల కారాగార శిక్ష విధించగలం. మహా అయితే 100 సంవత్సరాలు. కాని నేరస్తుడు అంతకాలం కారాగారంలో ఉంటాడా? ఈ లోపు మృత్యువు కబళించదా?

నిజమైన, ఖచ్చితమైన న్యాయం అంటే బాధితులకు పరిహారం లభించాలి. కాని నిరంకుశ నియంతల చేతుల్లో మరణించిన అమాయకులకు ఎలాంటి పరిహారం ఇవ్వగలం? వారికి ఎలాంటి పరిహారం మనం ఇవ్వలేం, ఎందుకంటే వారు మరణించారు. అనేకమంది మంచివారిని చిత్రహింసలు పెట్టడం, హతమార్చడం వంటి నేరాలు జరిగినప్పుడు ఆ బాధితులకు తగిన పరిహారం లభించడమే న్యాయం.

కాబట్టి సహేతుకంగా ఆలోచిస్తే మరణానంతరం శాశ్వత జీవితం అవసరమని తెలుస్తుంది. అప్పుడే ఈ ప్రపంచంలో చేసిన ఆచరణలకు తగిన ప్రతిఫలం వారికి లభించే అవకాశం ఉంటుంది. దేవుడు అందరికన్నా అత్యధికంగా న్యాయం చేసేవాడు. మనుష్యులు చేసిన మంచిపనులకు తగిన కానుక లేకుండా, చెడ్డపనులకు తగిన శిక్ష లేకుండా ఆయన వదలడం జరగదు.

స్వర్గంలో లేదా నరకంలో జీవితం అనేది శాశ్వతమైనది. ఎన్నటికీ అంతం కానిది. అక్కడ దేవుడు తగిన ప్రతిఫలం, శిక్షా లేదా బహుమానాలు ఇవ్వగలడు. ప్రపంచంలో బాధితులైన మంచివారికి తగిన పరిహారం అక్కడ ప్రసాదించగలడు.

## మరణం తర్వాత పునరుజ్జీవం సాధ్యమా?

మనందరికీ తెలిసిన విషయమేమంటే దేన్నయినా మొదటిసారి సృష్టించడం కష్టం. దానినే మరోసారి తయారు చేయడం తేలిక. మనిషిని మొదటిసారి సృష్టించడంలో దేవుడికి ఎలాంటి కష్టమూ లేనప్పుడు మనిషిని మరణానంతరం లేపడం ఆయనకు కష్టమా? నిజానికి ఇది దేవునికి మరింత తేలికైన పని.

## ఇస్లామ్ అంటే అర్థమేమిటి?

చాలా మంది అనుకుంటున్నట్లు ఇస్లామ్ ఒక కొత్త మతం కాదు. దీన్ని స్థాపించింది ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) కూడా కాదు. ఇస్లామ్ అనేది దేవుడు మనిషికి చూపించిన జీవనమార్గం. మొట్టమొదటి మానవుడు ఆదమ్ నుంచి ఆయన తర్వాత వచ్చిన మనుష్యులందరినీ సృష్టించినవాడు దేవుడు. దీన్ని ఇంకా వివరంగా అర్థం చేసుకోవాలంటే, దేవుడు పంపిన ప్రవక్తలందరూ – నూహ్, ఇబ్రాహీమ్, మూసా, సులైమాన్, దావూద్, ఈసా (వారందరిపై శాంతి కలుగుగాక) తదితరులందరు బోధించింది ఇదే జీవనమార్గాన్ని. అంటే దేవునికి హృదయపూర్వకంగా విధేయత చూపించి జీవించడం. అరబీ భాషలో ఈ జీవనమార్గాన్ని ఇస్లామ్ అంటారు.

## అల్లాహ్ ముస్లిముల దేవుడా?

చాలా మంది భావిస్తున్నట్లు అల్లాహ్ ముస్లిముల దేవుడు కాదు. అల్లాహ్ అంటే అరబీ భాషలో దేవుడు అని అర్థం. అందరినీ సృష్టించిన సృష్టికర్తను అరబీ భాషలో అల్లాహ్ అంటారు. అరబ్బీ మాట్లాడే యూదులు, క్రయిస్తవులు కూడా దేవుడు అన్న పదానికి బదులు అల్లాహ్ అన్న పదమే వాడుతారు.

తెలుగులో నీరు, ఇంగ్లీషులో వాటర్, హిందీలో పానీ, అరబీలో మా ... ఇలా ఏ పేరుతో పిలిచినా అది నీరే. ఒక గ్లాసుడు నీళ్ళను ఏ భాషలో చెప్పినా నీళ్ళుగానే ఉంటాయి కాని అవి మారిపోవు కదా. అలాగే తెలుగులో దేవుడు,

ఇంగ్లీషులో గాడ్, హిందీలో ప్రభూ, అరబీలో అల్లాహ్ .. ఈ పదాలన్నీ ఒకే సృష్టికర్త ఒకే ఒక్క దేవుడిని సూచిస్తాయి. ఆయనే మనందరినీ సృష్టించాడు.

## దేవుడు క్షమించని ఘోరమైన పాపం ఏది?

సత్యం గురించి తెలిసిన తర్వాత కూడా క్రింది పనులకు పాల్పడిన మనిషిని దేవుడు క్షమించనని ప్రకటించాడు.

1. దేవుడికి భాగస్వాములను నిలబెట్టడం. దేవుడికి సమానులుగా ఇతరులను ఆరాధించడం, విధేయత చూపడం.
2. దేవుడిని తిరస్కరించడం.

ఈ పాపం క్షమార్హం కానిదిగా దేవుడు ప్రకటించాడు. మనిషి ఈ పాపానికి పాల్పడి తన మరణానికి ముందు పశ్చాత్తాప పడకపోతే క్షమాభిక్ష లభించదు.

## ఆరాధన, విధేయతల విషయంలో దేవునికి సమానులుగా నిలబెట్టడం అంటే ఏమిటి?

క్రింది పనులు చేయడం వల్ల మనిషి దేవునికి సమానులుగా ఇతరులను నిలబెడతాడు.

1. ప్రకృతిలోని గాలి, నీరు, అగ్ని వంటి వాటిని లేదా మనిషి తయారు చేసిన రాతి ప్రతిమలు, విగ్రహాలు, చిత్రాలు, సాధుపురుషుల సమాధులను ప్రార్థించడం, ఆరాధించడం, సాష్టాంగపడడం.
2. మానవమాత్రులను దేవుని భార్య లేదా పిల్లలుగా పరిగణించి, వారికి దైవత్వాన్ని ఆపాదించడం. వారికి దేవుని గుణగణాలున్నాయని చెప్పడం.
3. దేవదూతలను లేదా కాల్పనిక దేవతలను, అగ్ని, వాయువులను లేదా గ్రహాలను ఆరాధించడం. నిజానికి వీటన్నింటిని దేవుడు సృష్టించాడు. దేవదూతలు నిజాయితీగా మనస్ఫూర్తిగా దేవునికి విధేయత చూపిస్తారు. అవిధేయత గురించిన ఆలోచన కూడా వారికి రాదు.

## దేవునికి భాగస్వాములను నిలబెట్టడం ఎందువల్ల మహా పాపం?

దేవుడికి మనిషి చేసే ఆరాధనలు, మనిషి విధేయతల అవసరం లేదు. దేవుడికి ఎలాంటి కోరికలు లేవు, ఎలాంటి అవసరాలు లేవు. మనిషికే దేవుని

కారుణ్యం దేవుని అనుగ్రహాల అవసరం ఉంది. ఇక్కడ ప్రశ్న ఏమంటే, "మనుష్యులు తనను నమ్మినా నమ్మకపోయినా దేవుడెందుకు పట్టించుకుంటాడు?". ఈ ప్రశ్నకు జవాబు క్రిందివిధంగా వివరించవచ్చు.

1. దేవుడు అవిధేయతను ఒప్పుకోవడం జరగదు. దేవుడు తనను ఆరాధించడానికి, తన పట్ల విధేయత చూపడానికే మనిషిని సృష్టించాడని ఇంతకు ముందు వివరించడం జరిగింది. కాబట్టి దేవునికి సమానంగా ఇతరులను నిలబెట్టడం, దేవుని దైవత్వంలో ఇతరులను భాగస్వాములుగా చేయడం లేదా దేవుని తిరస్కరించడం వంటి చర్యలు మనిషి పుట్టుకలోని ఉద్దేశ్యానికే విరుద్ధమైనవి. సృష్టికర్త పట్ల అతి తీవ్రస్థాయి అవిధేయతకు ఇవి నిదర్శనాలవుతాయి.
2. దేవుని పట్ల అవిధేయత యావత్తు జీవనవ్యవస్థను అస్తవ్యస్తం చేస్తుంది. ప్రపంచంలో చెడులు చెలరేగేలా చేస్తుంది. ఒక వ్యక్తి దేవుని నమ్మనప్పుడు లేదా దేవునికి సమానంగా ఇతరులను నిలబెడుతున్నప్పుడు ఆ వ్యక్తి దేవుని సర్వసత్తాక అధికారాన్ని నిరాకరిస్తున్నాడు, దేవుని దైవిక మార్గదర్శనాన్ని కాదంటున్నాడు. అలాంటి వ్యక్తులు తమ మనోవాంఛలను అనుసరిస్తారు. తాము దేవునికి జవాబు చెప్పుకోవలసి ఉందన్నది మరిచిపోతారు. ఇది ప్రపంచంలో సర్వ చెడులకు మూలకారణమవుతుంది.
3. దేవునికి భాగస్వాములను నిలబెట్టడం అన్నది అన్యాయానికి, కృతఘ్నుతకు పరాకాష్ఠ. మనం మన చుట్టూ చూస్తే అసంఖ్యాక దేవుని అనుగ్రహాలు మనకు కనబడతాయి. మనల్ని ప్రేమించే కుటుంబం, మన పిల్లలు, చూడడానికి, నడవడానికి ఇంకా అనేక పనులు చేయడానికి మనలో ఉన్న శక్తిసామర్థ్యాలు ఇవన్నీ దేవుని అనుగ్రహాలే. దేవుని సృష్టిలో అద్భుతమైన అందం ఉంది.

దేవుడు కాకుండా ఇవన్నీ మరొకరు ఇచ్చారనడం కృతఘ్నుత కాదా? ఇంతగా మనను అనుగ్రహించిన దేవుడికి కృతఘ్నులుగా మనం ఎలా ఉంటాం? దేవుడికి భాగస్వాములను ఎలా నిలబెట్టగలం? ఇది కృతఘ్నుత, అన్యాయం కాదా! దేవుడు మనపై కారుణ్యాన్ని అనుగ్రహాలను వర్షించినా మనం ఇలా చేయడం సబబా? దేవుడి చట్టాలను పట్టించుకోకుండా, దేవుడి అత్యున్నత వ్యక్తిత్వాన్ని చిత్రాల్లో కుదించి మనం మంచి మనుష్యులుగా ఎలా మారగలం?

## రుజువులేమిటి?

దేవుడు మనను గుడ్డిగా నమ్మమనడం లేదు. పైన చెప్పిన మాటలన్నింటికి రుజువు దేవుని చిట్టచివరి దైవగ్రంథం దివ్యఖుర్‌ఆన్.

దివ్యఖుర్‌ఆన్‌లో అనేక విషయాలున్నాయి. భూగర్భశాస్త్రం, మానవపిండాభివృద్ధి, ఖగోళశాస్త్రం, సముద్రశాస్త్రం, చట్టాలు, మానసికశాస్త్రం, వృక్షశాస్త్రం, భౌతికశాస్త్రం, జంతుశాస్త్రం వగైరా అనేక విషయాల గురించి మనం దివ్యఖుర్‌ఆన్‌లో చూడవచ్చు. దివ్యఖుర్‌ఆన్‌ను విశ్వసించని వారందరినీ ఖుర్‌ఆన్ స్వయంగా బహిరంగంగా సవాలు చేసింది. దివ్యఖుర్‌ఆన్ రచయిత (దేవుడు) స్వయంగా ఇలా అన్నాడు, **"వారు దీన్ని జాగ్రత్తగా పరిశీలించరా? ఇది దేవుడి నుంచి కాక ఇతరుల నుంచి వచ్చి ఉన్నట్లయితే ఇందులో అనేక తప్పులు, వైరుధ్యాలు ఉండేవి."**

***(దివ్యఖుర్‌ఆన్ : 4 : 82)***

ఆశ్చర్యకరంగా, దివ్యఖుర్‌ఆన్ శతాబ్దాలకు ముందే అనేక వైజ్ఞానిక విషయాలను ఖచ్చితంగా తెలియజేసింది. ప్రవక్త ముహమ్మద్ (ఆయనకు శాంతి కలుగుగాక) వంటి మానవమాత్రులు స్వయంగా వీటి గురించి తెలుసుకోవడం అసాధ్యం. కాబట్టి దివ్యఖుర్‌ఆన్ ఖచ్చితంగా దేవుని వాక్కు.

## ముగింపు

ఈ పుస్తకం ఎవరి భావాలను గాయపరచడానికి ఉద్దేశించింది కాదు. దేవుని సందేశాన్ని ప్రజలకు చేరవేయడం మాత్రమే మా ఉద్దేశ్యం. మనిషి తన ఉనికి లక్ష్యాన్ని గుర్తించేలా చేయాలన్నదే మా ప్రయత్నం. మనిషి తన ఉనికి లక్ష్యాన్ని గుర్తించడం ద్వారా మాత్రమే సమాజాన్ని సంస్కరించగలమన్నది మా నమ్మకం. మనం దేవుడి పట్ల విధేయతతో జీవితాన్ని గడపాలి. మనం అలా చేస్తే ఈ ప్రపంచం మెరుగైన ప్రదేశంగా మారుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.